క్లుప్తంగా

చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ



కేటీదొడ్డి: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో పోలీసులు వాహనాల తనిఖీ ముమ్మరంగా చేపట్టారు. బుధవారం మండలంలోని రాష్ట్ర సరిహద్దు నందిన్నె చెక్‌పోస్టు వద్ద ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కర్ణాటక రాష్ట్రాల నుంచి తెలంగాణలోకి మద్యం, డబ్బు రాకుండా అధికారులు గట్టి బందోబస్తుతో పాటు తనిఖీ చేపట్టారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది చక్రవర్తి, తిమ్మప్ప, శ్రీనివాసులు, వస్రంనాయక్, జగదీష్, ఐటీబీపీ పోలీసు సిబ్బంది ఉన్నారు.

అయిజ: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పోలీసులు వివిధ వాహనాలను తనిఖీ చేశారు. ఎస్ఐ నరేష్ కుమార్ ఆధ్వర్యంలో రాయచూర్-కర్నూల్- గద్వాల టీ రోడ్డులో తనిఖీ నిర్వహించారు. ఉత్తనూరు- రాయిచూరు-కర్నూలు టీ రోడ్డులో అనంతరం కర్నూలు-ఉప్పల-అయిజ టీ రోడ్లలో కార్లు, జీపులు, ఆటోలు, బస్‌లను పోలీసులు తనిఖీ చేశారు. సరైన ఆధారాలు చూపించిన రైతుల డబ్బును తిరిగి ఇచ్చేశారు.

నేడు బీఎస్పీ శంఖారావం

అలంపూర్: బీఎస్పీ అసెంబ్లీ ప్రచార శంఖారావం గురువారం ప్రారంభం అవుతుందని బీఎస్పీ సీనియర్ నాయకులు మహేష్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కనకం బాబు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అధ్యక్షుడు కేశరావు అధ్వర్యంలో ఉదయం జోగుళాంబ అమ్మవారిని దర్శించుకోనున్నట్లు తెలిపారు. అనంతరం సర్వమత ప్రార్థనల అనంతరం బీఎస్పీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తారని తెలిపారు. బీ ఎస్పీ నాయకులు తరలి రావాలని పిలుపునిచ్చారు.

కేసు నమోదు

గద్వాల క్రైం: తాళం వేసిన ఇంట్లోకి గుర్తు తెలియని దుండగులు చొరబడి రూ.25వేల విలువ గల బంగారు, వెండి ఆభరణాలు అపహరించినట్లు బాధితుడు బుధవారం పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పట్టణంలోని కుంటవీధికి చెందిన సతీష్ వృత్తిరిత్యా పాత బస్టాండ్ సమీపంలో అల్యూమీనియం దుకాణం నిర్వహిస్తున్నాడు. రోజు వారిలాగే ఉదయం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని దుండగులు తాళం ధ్వంసం చేసి ఇంట్లో ఉన్న రూ.25 వేల విలువ గల బంగారు, వెండి ఆభరణాలు దోచుకెళ్లారు. మధ్యాహ్నం ఇంటికి వచ్చేసరికి తలుపులు తెరిచి ఉండడంతో దొంగతనం జరిగినట్లు గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని చోరీపై ఆరా తీశారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

బెల్ట్‌షాపుల్లో మద్యం అమ్మితే చర్యలు

మానవపాడు: బెల్ట్‌షాపుల్లో మద్యం అమ్మకాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రాము తెలిపారు. బుధవారం మండలంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి జిల్లా ఉన్నతాధికారుల ఆదేశానుసారం పోలీస్ సిబ్బందితో కలిసి విస్తృతంగా తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో కొనసాగుతున్న దుకాణాలు, బెల్ట్‌షాపులలో తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 351.47 లీటర్ల మద్యం పట్టుకున్నామన్నారు. దీని విలువ రూ. 3,59,111 ఉంటుందన్నారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన మద్యాన్ని కారులో కొర్విపాడు స్టేజీ సమీపంలో పట్టుకొని సీజ్ చేసినట్లు తెలిపారు. మద్యం విలువ రూ.3లక్షలు ఉంటుందన్నారు. మొత్తంగా రూ. 6,59,111లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

మద్యం పట్టివేత

అలంపూర్: సరిహద్దు వద్ద వాహన తనిఖీలో మద్యం పట్టుబడినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం.. అలంపూర్-ర్యాలంపాడు తుంగభద్ర నది బ్రిడ్జి వద్ద పోలీసులు బుధవారం వాహన తనిఖీ చేపట్టినట్లు తెలిపారు. మండలంలోని జిల్లెలపాడు మద్దిలేటి బైక్‌ను తనిఖీ చేయగా అందులో మద్యం ఉన్నట్లు గుర్తించారు. 17.28 లీటర్ల మద్యం ఉండగా, దీని విలువ రూ.48,008గా ఉంటుందని అంచనా వేశారు. పట్టుబడిన మద్యం పంచనామా నిర్వహించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. తన బెల్టు షాప్‌కు మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

టీడీపీ నాయకులపై కేసు నమోదు

రాజోళి: టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు నాయుడు స్కిల్ డెవలప్ మెంట్ కేసులో అరెస్ట్ అయిన సంగతి తెలిసిందే. ఆయన బెయిల్‌పై విడుదల కావడంతో మంగళవారం రాత్రి టీడీపీ శ్రేణులు మండల కేంద్రంలో సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా బాణా సంచా పేలుస్తుండటంతో, సమాచారం తెలుసుకున్న ఎస్ఐ ఖాదర్ బాషా అక్కడకు చేరుకుని దాదాపు 10 మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున, గుంపులుగా ఏర్పడి, ఈలలు, కేకలు వేస్తూ, ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా ప్రవర్తించారని, వారిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

సాగునీరు లేక రైతుల అవస్థలు

- తుమ్మిళ్ల నీరు పంటలకు అందడంలేదు
- మిర్చిపంటకు రూ.లక్షల పెట్టుబడులు
- దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు



నీరు లేక మిరప పంటను తొలగిస్తున్న రైతు



ట్యాంకర్ల ద్వారా మిరప పంటకు నీరు

మానవపాడు: ప్రకృతి రైతులపై కన్నెర చేసింది. కష్టపడి పంటలు పండించే రైతు పరిసిత్థి అగమ్యగోచరంగా మారింది. రెండు నెలలుగా వర్షాల జాడలేదు. తుమ్మిళ్ల ద్వారా నీరు అందక పంటపొలాలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. పంటను కాపాడుకునేందుకు రైతులు ఎకరానికి రూ.లక్షలో అప్పులు తెచ్చిమరి సాగుచేస్తున్నారు. ట్యాంకర్ల ద్వారా నీరు అందిస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల అవసరాలు తీర్చే అన్నదాతల జీవితాలు ఆగమవుతున్నాయి. ప్రభుత్వం చొరవ చూపి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

వర్షం కురవక.. నీరు అందక..

మానవపాడు మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో రైతులు వ్యవసాయంపై ఆధాపడి జీవనం సాగిస్తున్నారు. మండలంలో రైతులు వాణిజ్య పంటలపై మక్కువ చూపుతున్నారు. మండలంలో మిరప 10,658, పత్తి 15,750, కంది 2,000, పొగాకు 100, మొక్కజొన్న 380 ఎకరాల్లో పంటలను రైతులు సాగు చేశారు. ఒక్కో ఎకరాకు కౌలు మిరపకు రూ.20వేల నుంచి రూ.45వేల దాకా రైతులు సాగుకు తీసుకున్నారు. మిగితా పంటలకు దాదాపు ఎకరాకు రూ. 10వేల నుంచి రూ.16వేల దాకా కౌలుకు తీసుకున్నారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులు విత్తనం వేసినప్పటి నుంచి ఆగస్టు నెల నుంచి ఇప్పటి వరకు సరైనా వర్షాలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కర్ణాటక ఎగువ ప్రాంతాల్లో కూడా రెండు నెలలుగా వర్షాలు కురవక పోవడం, సుంకేసుల వద్ద డ్యాం నిండక, తుమ్మిళ్ల ఎత్తిపోతలకు నీరు అందక డీ 29, డీ 30, డీ 31 కాల్వల వద్ద మిరప పంటను సాగు చేసిన రైతులు పంటలకు రూ.లక్షలో ఖర్చు చేసి పెట్టుబడులు పెడుతున్నారు.

నీరు అందక అవస్థలు తప్పడం లేదు



15 ఎకరాల్లో మిరప పంటను సాగు చేశాను. జూ న్‌లో వర్షం కురవడంతో మిరప విత్తనాలు, నాటు వేశాం. రెండు నెలుగా సరైన వర్షం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. 20 రోజుల క్రితం ఎగువ ప్రాంతంలో కు రిసిన వర్షం వల్ల తుమ్మిళ్ల ఎత్తిపోతల ద్వారా మి రపకు సాగునీరు అందించాం. ఇప్పుడు నీరు అందక ఎండిపోయే పరిస్థితి వచ్చింది. నీటి పారుదల శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి.

– గొల్ల వెంకట్రాముడు, రైతు, మానవపాడు

ట్యాంకర్లతో పంటలకు నీరు..



నాకు నాలుగు ఎకరాల సొంతపొలం ఉంది. 14 ఎకరాలు కౌలుకు తీసుకొని మిరపపంట సాగుచేశాను. మొత్తం మిరప పంటకు రూ.11లక్షలు పెట్టుబడి పెట్టాను. ట్యాంకర్ల ద్వారా మిరపకు నీరు అందిస్తున్నా ఒక ఎకరాకు 25 నుంచి 30 ట్యాంకుల నీరు పడుతోంది. ఒక్కో ట్యాంకుకు రూ.700 వరకు ఖర్చు అవుతోంది. తుమ్మిళ్ల ద్వారా నీరు అందితే ఖర్చు తగ్గుతుంది. ప్రభుత్వం చర్యలు తీసుకోని నీరు అందించాలి.

– బాషా, గోకులపాడు

20 ఎకరాల్లో మిర్చి సాగు చేశా..



20 ఎకరాల్లో మిరప పంటను సాగు చేశాను. ఎకరాకు రూ.60వేలకు పైగా ఖర్చు చేశాను. తుమ్మిళ్ల ద్వారా నీరు అందిస్తే బాగుంటుంది. కర్నూల్ అధికారులతో మాట్లాడి, ఆంధ్రప్రదేశ్ ఇండెంట్, తెలంగాణ ఇండెంట్ పెడితే తుమ్మిళ్లకు త్వరగా నీరు వచ్చే అవకాశం ఉంది. దానివల్ల రైతుల పంటపొలాలకు నీరు అందుతుంది. ప్రభుత్వం చొరవ చూపి రైతులకు నీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

– బీమరాజు, రైతు, గోకులపాడు

ప్రజలందరికీ సంక్షేమ పథకాలు



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల రూరల్: అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమాభివృద్ధి పథకాలను అందిస్తున్న ఏకైక సీఎం కేసీఆర్ అని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్ అందిస్తున్న పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు పెద్ద ఎత్తున బీఆర్‌ఎస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. బుధవారం గద్వాల పట్టణానికి చెందిన బీజేపీ నాయకులు ప్రవీణ్‌కుమార్, శోభన్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో వివిధ వార్డులకు చెందిన నాయకులు పార్టీలో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, నాగర్‌దొడ్డి వెంకట్రాములు, కౌన్సిలర్ శ్రీనివాసులు, నరహరిశ్రీనివాసులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ వైఖరితో ఘర్షణలు..

కాంగ్రెస్ పార్టీ కులరాజయాలతో గ్రామాల్లో ఘర్షణలు చోటుచేసుకునే ప్రమాదముందని మల్దకల్ మండలం ఉలిగెపల్లి సర్పంచ్ చిన్న రాములు అన్నారు. ఆయన మల్దకల్ బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన సీనియర్ నేతలు జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, సత్యారెడ్డి, విక్రమ్‌సింహారెడ్డి, నాగర్‌దొడ్డి ఆధ్వర్యంలో మాట్లాడారు. మంగళవారం రాత్రి పదిగంటల ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు ఇంటికొచ్చి బలవంతంగా తనమెడలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పినట్లు తెలిపారు. తాను ముందునుంచి ఎమ్మెల్యే వర్గంగా కొనసాగుతున్నానని, పార్టీ మారే ప్రసక్తి లేదని తెలిపారు. అనతంరం సర్పంచు చిన్న రాములుఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.

కేటీదొడ్డి: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కొండాపురంలో ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ విజయం ఖాయమని ఆమె పేర్కొన్నారు.

బాల్య వివాహాలు చట్టరిత్యా నేరం



గద్వాల అర్బన్: 18ఏళ్లలోపు బాలికలకు వివాహాలు చేయడం చట్టరిత్యా నేరమని డీసీపీఓ నర్సింహ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో బాలల హక్కుల అంశంపై అవగాహన కల్పించారు. బాలల సంరక్షణ కోసం 1098 నంబర్ అందుబాటులో ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, చైల్డ్‌లైన్ సిబ్బంది ఉన్నారు.

నేడు బీఆర్‌ఎస్ అభ్యర్థి ప్రచారం

అలంపూర్: బీఆర్‌ఎస్ అభ్యర్థి డాక్టర్ వీఎం అబ్రహం గురువారం నుంచి ప్రచారం ప్రారంభించనున్నట్లు పార్టీ కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. ఇటిక్యాల మండలంలోని చాగాపురంలో ప్రజా ప్రతినిధులతో కలిసి ఉదయం 7 గంటలకు ప్రచారం ప్రారంభించనున్నట్లు తెలిపారు. షాబాద గ్రామంలో ఉదయం 8 గంటలకు, ఉదండాపురం గ్రామంలో ఉదయం 9 గంటలకు సాతర్ల గ్రామంలో ఉదయం 9.30 గంటలకు ప్రచారం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఉద్యోగం సాధించిన పూర్వ విద్యార్థులకు సన్మానం

మానవపాడు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001–2002 పూర్వ విద్యార్థులు పోలీస్ ఉద్యోగాలకు ఎంపికైన ప్రతాప్, సరేంద్ర, సంజీవ, పరశురాముడు, మద్దిలేటి, వేణు, పురేందర్‌నాయుడులను సన్మానించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు పాఠశాలకు రూ. 15వేల విరాళం అందించారు. కార్యక్రమంలో ఎస్ఐ రాము, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

మానవపాడు: విద్యార్థులు బాల్యవివాహాలు, ర్యాగింగ్‌లకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రాము తెలిపారు. బుధవారం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, శ్రీగంగు వెంకటకృష్ణారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్క బాలిక ధైర్యంగా ఉండాలని సూచించారు. బాల్యవివాహాలు చేసుకోరాదన్నారు. విద్యార్థినులను ఎవరు ఇబ్బందులకు గురిచేసినా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు

ఎర్రవల్లిచౌరస్తా: ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన ఆటో డ్రైవర్‌పై కేసు నమోదైన ఘటన ఇటిక్యాల పీఎస్‌లో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ అశోక్‌బాబు కథనం మేరకు.. మండలంలోని మొగిలి రావుల చెర్వుకు చెందిన బోయ నారాయణ గతనెల 29న ద్విచక్ర వాహనంపై గ్రామానికి చెందిన బాబు, భీమన్నలతో పూడూరుకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో మార్గం మధ్యలో వారు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బోయ నారాయణకు తీవ్ర గాయాలు కాగా, మిగిలిన ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వారిని చికిత్స నిమిత్తం కర్నూల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్ రాములుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గడప గడపకు ప్రచారం



బుడమొర్సులో ప్రచారం చేస్తున్న విజేయుడు

శాంతినగర్: బీఆర్‌ఎస్ పార్టీ ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి బలపరుస్తున్న అలంపూర్ నియోజకవర్గ టికెట్ ఆశిస్తున్న విజేయుడు ప్రచారం చేస్తున్నాడు. వడ్డేపల్లి మున్సిపాలిటీలోని పైపాడు, మండలంలోని రామాపురం, బుడమొర్సులో గడప గడపకు ప్రచారం చేపట్టారు. బీఆర్‌ఎస్ నాయకులు అయన వెంట నడిచారు. ఇంటింటికి వెళ్లి కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, బీఆర్‌ఎస్ మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పుల్లూరు నాగేశ్వర్‌రెడ్డి, పైపాడు మధుసూదన్‌రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, రవి రెడ్డి, రామాపురం పీఏసీఎస్ వైస్ చైర్మన్ లక్ష్మీరెడ్డి, గజేందర్‌రెడ్డి, జహంగీర్‌బాషా, బుడమొర్సు సర్పంచ్ తిమ్మప్ప, ఆలయకమిటీ డైరెక్టర్ వెంకటేష్, గోపాల్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

రామాపురం గ్రామానికి చెందిన కిషోర్ భార్య మృతిచెందడంతో విషయం తెలుసుకున్న విజేయుడు వారి ఇంటికెళ్లి బాధితులను పరామర్శించారు.

అలంపూర్‌లో మహిళకు అవకాశం ఇవ్వండి



మాట్లాడుతున్న మధుసూదన్ రెడ్డి

అయిజ: అలంపూర్ నియోజకవర్గంలో ప్రస్తుతం బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎంపిక, బీఫాంల అందజేతపై ప్రతిష్టంభన నెలకొందని, మహిళ అభ్యర్థికి అవకాశం ఇవ్వాలని సింగిల్‌విండో ప్రసిడెంట్ పోతుల మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అలంపూర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే అబ్రహం తనకే బీఫాం వస్తుందని ప్రచారం చేసుకుంటుంటే ఎమ్మెల్సీ అనుచరుడికి బీఫాం వస్తుందని ప్రచారం సాగుతోందన్నారు. దీంతో అలంపూర్ నియోజకవర్గంలో గందరగోళం నెలకొందన్నారు. ఇద్దరు వ్యక్తులకు కాకుండా ప్రత్యామ్నాయంగా సింగిల్‌విండో ప్రసిడెంట్ సతీమణి ఎస్ఐ మేరమ్మకు బీఫాం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మేరమ్మ, జమాలుద్దీన్, ఆంజనేయులు పాల్గొన్నారు.

ప్రజల ప్రాణాలు కాపాడాలి



అయిజలో నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

అయిజ: ఇజ్రాయెల్ పాలస్తీనాపై చేస్తున్న దాడులను ఆపాలని, అక్కడ శాంతి నెలకొల్పి ప్రజల ప్రాణాలను కాపాడాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వీవీ నరసింహ కోరారు. బుధవారం మండల కేంద్రంలో సీఐటీయూ కార్మిక సంఘం, ఐద్వా ఆధ్వర్యంలో పాలస్తీనాపై ఇజ్రాయెల్ చేస్తున్న దాడులపై నిరసన తెలిపారు. ఐద్వా జిల్లా కార్యదర్శి నర్మద మాట్లాడుతూ పాలస్తీనాపై జరుగుతున్న యుద్ధం ఆపాలని, ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఈశ్వర్, రాముడు, వీరేష్; తిరుమలేష్, సివిల్ స ప్లయ్ హమాలీ సంఘం నాయకులు శంకర్‌గౌడ్, ఆంజనేయులు, మహిళా సంఘం సభ్యులు సరో జమ్మ, పద్మమ్మ, సంతోషమ్మ పాల్గొన్నారు.

రాజోళి: సామ్రాజ్యవాద శక్తుల అండతో పాలస్తీనీయులపై జరుగుతున్న దాడులను ఆపాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు తిప్పన్న అన్నారు. మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహం ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో జయన్న, లక్ష్మన్న, కృష్ణ, తిక్కన్న, కేవీపీఎస్ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు



కాంగ్రెస్‌లో చేరిన వారితో జెడ్పీ చైర్‌పర్సన్ సరిత

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని జెడ్పీ చైర్‌పర్సన్ క్యాంపు కార్యాలయంలో బుధవారం కేటీదొడ్డి మండలం ఉమిత్యాల తండా, గద్వాల పట్టణంలోని జమ్మిచేడు, ధరూరు మండలం ఖమ్మంపాడుకు చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున్న కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి జెడ్పీ చైర్‌పర్సన్, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సరిత కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

- 12వ విడత సామాజిక తనిఖీలో డీఆర్‌డీఓ ఉమాదేవి



సిబ్బందితో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ ఉమాదేవి

మల్దకల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీపనుల్లో అవినీతి, అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని జోగుళాంబ గద్వాల జిల్లా డీఆర్‌డీఓ ఉమాదేవి హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ కృష్ణయ్య అధ్యక్షతన 12వ విడత సామాజిక తనిఖీ బహిరంగ చర్చ వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందాలు ఉపాధి హామీలో జరిగిన అవినీతి, అక్రమాలను బహిరంగ చర్చ వేదిక గ్రామాల వారీగా చదివి వినిపించారు. ఉపాధి హామీలో భాగంగా ఆయా గ్రామాల్లో రోడ్లకు ఇరువైపుల నాటిన మొక్కలతో పాటు తోటల పెంపకంలో అవినీతి, అక్రమాలు జరిగినట్లు సామాజిక తనిఖీ బృందం సభ్యులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. మండలంలో మొత్తం 25గ్రామ పంచాయతీలలో రూ.5,38,12,372ల ఖర్చుతో ఉపాధి హామీ పనులు చేపట్టగా, వాటిలో కూలీలకు రూ. 4,86,13,199, సామాగ్రి నిర్వాహణకు రూ. 52,2,173లు ఖర్చు చేసినట్లు ఎంపీడీఓ కృష్ణయ్య తెలిపారు. వాటిలో రూ.3,696 రికవరీకి ఆదేశించినట్లు ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణయ్య, ఎంపీఓ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఎస్ఆర్‌సీ అనిల్‌కుమార్, ఏపీఓ స్వామి, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలి



మాట్లాడుతున్న హనిమిరెడ్డి

శాంతినగర్: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు కృషిచేయాలని ఎంవీ ఫౌండేషన్ మండల కన్వీనర్ హనిమిరెడ్డి అన్నారు. వడ్డేపల్లి మండలంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం పాఠశాల యాజమాన్య కమిటీ రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలో మధ్యాహ్న భోజనం, బ్రేక్ ఫాస్ట్, బాల్య వివాహాల నిర్మూలన, జండర్ కమిటీలు, పాఠశాల అభివృద్ధి విషయాలపై సమావేశం నిర్వహించారు. సమావేశంలో గ్రామ మాజీ ఎంపీటీసీ రాజు, ఎస్ఎంసీ సభ్యులు, అంగన్‌వాడీ టీచర్ సంగీత పాల్గొన్నారు.

వృథాగా నెట్టెంపాడు జలాలు



రోడ్డుపై వృథాగా పోతున్న నెట్టెంపాడు జలాలు

ధరూరు: వర్షాలు లేక అంతంత మాత్రంగా సాగైన పంటలకు సాగు నీరందక రైతులు ఇబ్బందులు పడుతుంటే కొన్ని ప్రాంతాల్లో అదే జలాలను వృథాగా వాగులు, వంపుల వెంట వదులుతున్న పరిస్థితి మండలంలో నెలకొంది. వివరాల్లోకెళితే.. మండలంలోని గుడ్డెందొడ్డి గ్రామ శివారులోని లిఫ్టు-1 పంప్‌హౌస్ నుంచి ఎత్తిపోస్తున్న నీటిని గ్రావిటీ కెనాల్ ద్వారా ర్యాలంపాడు రిజర్వాయర్ వరకు తరలించి ఏటా రిజర్వాయర్‌ను నింపుతూ రైతులకు సాగు నీటిని అందిస్తూ వస్తున్నారు. కెనాల్ వెంట ఉన్న మన్నాపురం, గుడ్డెందొడ్డి గ్రామాల రైతులు కాలువకు మోటార్లు వేసుకుని నీటిని పొలాలను తరలిస్తూ పంటలు సాగు చేసుకుంటున్నారు. మోటార్లను ఆన్ చేస్తున్న రైతులు పంట పొలాలకు నీళ్ల పారించి, వారు గమనించకపోవడంతో నీరు గెట్లు ఎక్కి పారిపోతున్నా పట్టించుకోవడం లేదు. మన్నాపురం-చింతరేవుల గ్రామాల మధ్య ఇలా ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లకుండా చేసేలా మూడు ప్రాంతాల్లో పారుతున్న వృథా నీటిని అరికట్టే నాథులే లేరా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇరిగేషన్ శాఖ అధికారులైనా ఈ విషయంలో దృష్టిసారించాలని కోరుతున్నారు.

సమస్యలు చెప్పినా పరిష్కారం కావు




ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజా ప్రతినిధులు

మానవపాడు: 'సమస్యలు పరిష్కారం కాకుంటే సమావేశం ఎందుకు నిర్వహించాలని, చెప్పుకుంటే తీరవు, అధికారులు పట్టించుకోరు' అంటూ సర్వ సభ్య సమావేశంలో సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం సర్వసభ్య సమావేశం వైస్ఎంపీపీ సోమ్మన్నగౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. విద్యుత్ సరఫరా సరిగ్గా లేక ప్రతి ఇంట్లో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తెలిపారు. విద్యుత్ సమస్యలపై విద్యుత్ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని విద్యుత్ ఏఈపై మండిపడ్డారు. కలుకుంట్ల సర్పంచ్ ఆత్మలింగారెడ్డి. శ్మశానవాటికకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని రూ.6500 డీడీ కట్టిన కనెక్షన్ ఇవ్వలేదన్నారు. చెన్నిపాడు, జల్లాపురం, అమరవాయి గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై సర్పంచ్‌లు నిలదీశారు. కార్యక్రమంలో తహసీల్దార్ జుబేర్‌మొహినొద్దీన్, ఎంఈఓ శివప్రసాద్, పంచాయతీ రాజ్ ఏఈ నరేందర్ పాల్గొన్నారు.

ఎస్టీయూ టీఎస్ నూతన కార్యవర్గం ఎన్నిక

ధరూరు: ఎస్టీయూ టీఎస్ నూతన ఉపాధ్యాయ సంఘం మండల కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ధరూరు మండల గౌరవ అధ్యక్షుడిగా సంపత్ కుమార్, అధ్యక్షుడిగా రాజన్న, ఉ పాధ్యక్షుడిగా జగదీశ్వరాచారి, ప్రధాన కార్యదర్శిగా రియాజ్, సహాయ కార్యదర్శిగా బద్రుద్దీన్, కోశాధికారిగా శివకుమార్, జిల్లా కౌన్సిల్ సభ్యులుగాగా రీశంకర్, కిషోర్‌చంద్ర, ఇస్మాయిల్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా శ్రీహరి, పరిశీలకులుగా కృష్ణయ్య ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నిక జరిగినట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

టీకాలతో తల్లీ బిడ్డ సురక్షితం



రాజోళి: టీకాలతో తల్లిబిడ్డ సురక్షితంగా ఉంటారని, వైద్య సిబ్బంది అన్నారు. మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది గర్భిణులకు, శిశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారికి పలు సలహాలు అందించారు. గర్భిణులు తప్పకుండా టీకాలు తీసుకోవాలని, దీని వల్ల కడుపులో ఉండే బిడ్డ కూడా సురక్షితంగా ఉంటుందని, శిశులకు ఇవ్వడం వల్ల వారిలో రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి మాలాధారణ



ఉండవెల్లి: మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో భక్తులు అయ్యప్ప మాల ధరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం అయ్యప్పస్వామి ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, గురుస్వామి సూర్యకాంతారెడ్డి, రాములు ఆధ్వర్యంలో 20 మంది మాలలు ధరించారు. అర్చకులు ఆంజనేయ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



శరణప్ప (ఫైల్)

అయిజ: మద్యం మత్తులో పురుగుల మందు తాగి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ నరేష్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఈడుగోనిపల్లికి చెందిన గొల్ల శరణప్ప (35) వ్యవసాయ కూలీ పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో అప్పుల పాలై తాగుడకు బానిసయ్యాడు. ఈక్రమంలో మంగళవారం రాత్రి మద్యం మత్తులో పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం కర్నూల్ తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.